
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



మంచిర్యాల
జిల్లా వార్తలు

5

మంగళవారం 26 నవంబరు 2024

వణికిస్తున్న చలి

- రోజురోజుకు పెరుగుతున్న చలి తీవ్రత
- 13డిగ్రీలకు పడిపోయిన రాత్రి ఉష్ణోగ్రతలు
- జాగ్రత్తలు అవసరం అంటున్న వైద్యులు

6



రైతన్నకు అభయమిచ్చే పెద్దయ్య దేవుడు

- చారిత్రక ప్రాశస్త్యం పెద్దయ్య..చిన్నయ్య ఆలయం
- ఏకైక పాండవుల దేవాలయం..
- పెద్దయ్య ఆలయాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి

7



మొక్కులు చెల్లించేందుకు నిలబడిన భక్తులు

ధాన్యం నిల్వ చేసేదెలా..?



భీమారం మండలంలో కళ్లంలోనే ఉన్న ధాన్యం

- 13 మిల్లులకే జియో ట్యాగింగ్
- సేకరణ లక్ష్యం 3 లక్షల మెట్రిక్ టన్నులు
- కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాప్యం
- కళ్లాల్లోనే మూలుగుతున్న ధాన్యం

మంచిర్యాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించే ధాన్యాన్ని మిల్లుల్లో నిల్వ చేసేందుకు అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. సీఎంఆర్ పెండింగులో ఉన్న రైస్‌మిల్లులపై చర్యలు తీసుకున్న నేపథ్యంలో సివిల్ సప్లయిస్ అధికారులు వానాకాలం సీజన్‌లో ధాన్యం దించేందుకు కేవలం 13 మిల్లులను మాత్రమే ఎంపిక చేసి జియో ట్యాగింగ్ ఇచ్చారు. జిల్లాలో మొత్తం 54 రైస్‌మిల్లులు ఉండగా వాటిలో బాయిల్డ్-19, రా రైస్ మిల్లులు 35 ఉన్నాయి. సీఎంఆర్ పెండింగు కారణంగా అధికారులు 12 మిల్లులపై రెవెన్యూ రికవరీ చట్టం ప్రయోగించగా, మరో రెండు మిల్లులపై కేసులు నమోదు చేశారు. దీంతో అభియోగాలు ఎదుర్కొంటున్న మిల్లర్లకు ఈసారి ధాన్యం ఇవ్వవద్దన్న ప్రభుత్వ ఆదేశాలతో అధికారులు వాటిని పక్కన బెట్టారు. అయితే కేసులు ఎదుర్కొంటున్న 14 మిల్లులతోపాటు జియో ట్యాగింగ్ ఇచ్చిన 13 పోను మిగతా 27 మిల్లులకు కూడా అధికారులు అనుమతులు ఇవ్వడం లేదు.

నిలువ చేయడంలో ఇబ్బందులు

జిల్లాలో 13 మిల్లులకు అధికారులు ధాన్యం ఇవ్వాలని నిర్ణయించడంతో ధాన్యం నిలువ చేసేందుకు స్థలాలు వెతుకుతున్నారు. జిల్లాలో 1,60,605 ఎకరాల్లో ఈ సీజన్‌లో 3,68,140 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. అందులో ప్రైవేటులో అమ్మకాలు, పంట నష్టాలు పోను కనీసం 2 లక్షల మెట్రిక్ టన్నుల వరకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించాల్సి ఉంది. అయితే అధికారులు ఎంపిక చేసిన ప్రకారం 13 మిల్లుల సామర్థ్యం కేవలం 64 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే. ఈ క్రమంలో మిగతా 1,36,000 మెట్రిక్ టన్నులను ఎక్కడ దించాలో తెలియని పరిస్థితుల్లో ...

మిగతా 7లో

న్యూస్ బాక్స్

టైగర్ జోన్‌లో పర్యటించిన లక్షెట్టిపేట సివిల్ జడ్జి



జన్నారం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కవ్వాల టైగర్ జోన్‌లోని జన్నారం డివిజన్ అటవీ ప్రాంతంలో సోమవారం లక్షెట్టిపేట జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అసదుల్లా షరీఫ్ పర్యటించారు. సఫారీ ద్వారా అటవీ ప్రాంతంలోని గోండుగూడ, పైడిపెల్లి, బైసన్ కుంట, నీలుగాయికుంట, అల్లినగర్, మహ్మదాబాద్, మల్యాల వాచ్ టవర్, తాళ్లపేట రేంజ్ అటవీ ప్రాంతాల్లో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ కవ్వాల టైగర్ జోన్ పర్యాటకంగా ఎంతో అందంగా ఉందన్నారు. ఎఫ్ఆర్‌వో సుష్మారావు, బీట్ అధికారి శ్రీనివాస్ ఉన్నారు.

ఎస్సై బదిలీ

మంచిర్యాల అర్బన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా పనిచేస్తున్న సిహెచ్ సనత్‌కుమార్ బదిలీ అయ్యారు. ఈ మేరకు ఆయనను పెద్దపల్లి జిల్లాలోని జూలపల్లి పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వోగా నియమిస్తూ మల్టీజోన్ వన్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ చంద్రశేఖర్ రెడ్డి సోమవారం ఉత్తర్వులు వెలువరించారు.

ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి



ఆర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రజావాణి దరఖాస్తులను అధికారులు సమన్వయంతో త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ మోతిలాల్, ఆర్డీవోలు శ్రీనివాస రావు, హరికృష్ణతో కలిసి ఆర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. లక్షెట్టిపేట, జన్నారం, కాసిపేట, మంచిర్యాల, మందమర్రి, కోటపల్లి, గర్మిళ్ల, చెన్నూరు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు దరఖాస్తులు అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకొంటామన్నారు.

తక్కువ వయసు వారు ఓటర్లుగా నమోదు

చెన్నూరు, (ఆంధ్రజ్యోతి): దుగ్నేపల్లిలో తక్కువ వయస్సు ఉన్న వారిని ఓటర్లుగా నమోదు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజావాణిలో రమేష్ రెడ్డి, తిరుపతిరెడ్డి, ప్రకాష్‌రెడ్డిలు ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. వారి వయస్సును నిర్ధారణ చేసి ఓటరు జాబితా నుంచి తొలగించాలని, దీనిపై విచారణ చేసి అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

నమూనా పోలింగ్

హాజీపూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): దొనబండ గ్రామంలోని శ్రీచైతన్య పాఠశాలలో సోమవారం విద్యార్థులకు నమూనా పోలింగ్ నిర్వహించి ఎన్నికల విధానంపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ దేవేందర్, కరస్పాండెంట్ బేతు రవి ఆధ్వర్యంలో 8,9,10 తరగతుల క్లాస్ లీడర్లను ఎన్నుకునేందుకు విద్యార్థులకు మాక్ పోలింగ్ నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా ఎన్నికల్లో పాల్గొన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

భీమిని, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి చెందుతుందని నాయకుడు మాదవరపు నర్సింగారావు అన్నారు. సోమవారం వెంకటాపూర్‌లో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. సుంకరి సత్తయ్య ఇంటి నుంచి వాగు వరకు రూ.4 లక్షలతో సిమెంట్ రోడు, పాఠశాల ప్రహరీ నిర్మాణాలకు భూమి పూజ చేశారు. మండల అధ్యక్షుడు గాదం లక్ష్మీనారాయణ, రామాంజనేయులు, మాజీ సర్పంచు దారిశెట్టి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వివేక్ చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న ట్రాక్టర్ అసోసియేషన్ సభ్యులు

రామకృష్ణపూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): క్యాతన్‌పల్లి మున్సిపాల్టీ శ్రీనివాస గార్డెన్ వద్ద ట్రాక్టర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఎమ్మెల్యే వివేక్‌కు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ కొన్ని నెలలుగా ఇసుక రవాణా ఆన్‌లైన్ లేక నిలిచిపోయిందన్నారు. ముల్కల్ల నుంచి ఇసుక రవాణాకు ఎమ్మెల్యే కృషి చేశారని అన్నారు. మందమర్రి మండలంలో ట్రాక్టర్ నడుపుకుంటూ జీవనం సాగించే వారు కుటుంబాన్ని నడుపుకోలేని పరిస్థితిలో ఉండగా, ఎమ్మెల్యే ట్రాక్టర్ యజమానుల పరిస్థితి అర్థం చేసుకొని ఆన్‌లైన్ సేవలకోసం కృషి చేశారని అన్నారు. తిమ్మాపూర్, బొక్కలగుట్ట, మందమర్రి ఇన్‌చార్జీలు సంతోష్, సందీప్, శివకుమార్, ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

ఎస్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు



మందమర్రిరూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎస్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడిగా బట్టారి వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల మంచిర్యాలలో జరిగిన రాష్ట్ర సమావేశంలో రాంసుబ్బారావు, పోలురెడ్డిలు వెంకటేశ్వర్లును ఎన్నుకుని నియామక పత్రం అందించారు. ప్రధాన కార్యదర్శిగా బాపు, గౌరవధ్యక్షులుగా కరుణాకర్, అసోసియేట్ అధ్యక్షుడిగా సత్తయ్యవైస్ ప్రెసిడెంట్‌గా పద్మలను ఎన్నుకున్నారు.

విద్యార్థిని శైలజది ప్రభుత్వ హత్యే

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో కలుషితం ఆహారం తిని చికిత్స పొందుతూ మృతి చెందిన విద్యార్థినీ శైలజది ప్రభుత్వ హత్యేనని ఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నీరటి రామ్ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థిని పాఠశాలలో కలుషిత ఆహారం తిని ఫుడ్ పాయిజన్ కారణంగా కొన్ని రోజులుగా హైద్రాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందడం బాధాకరమన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించడంలో విఫలమైందన్నారు. వెంటనే విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలని లేకుంటే ఆందోళనలు చేస్తామన్నారు.

వినియోగదారుల ఆర్థిక ప్రగతికి చేయూత

- గాయత్రి బ్యాంక్‌ను ప్రారంభించిన కలెక్టర్



గాయత్రి బ్యాంకును ప్రారంభిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : గాయత్రి బ్యాంకు అభివృద్ధి పథంలో ముందుకు సాగుతూ వినియోగదారుల ఆర్థిక ప్రగతికి చేయూతనిస్తుందని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. నస్పూర్‌లో గాయత్రి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు 50వ బ్రాంచీని సోమవారం కలెక్టర్ కుమార్ దీపక్, వివిధ విభాగాలను జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ తిరుపతిలు ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ నస్పూర్ ప్రాంత ప్రజలు ఖాతాలను తెరిచి బ్యాంకు సేవలను వినియోగించుకోవాలని సూచించారు. బ్యాంకు ముఖ్య కార్యనిర్వహణాధికారి వనమాల శ్రీనివాస్ మాట్లాడుతూ సామాన్య, మధ్య తరగతి, వర్తక, వాణిజ్య వర్గాల ప్రజలకు కార్పొరేట్ బ్యాంకులకు దీటుగా సేవలందిచమే లక్ష్యమన్నారు. ఆన్‌లైన్ సేవలతోపాటు అధునాతన డిజిటల్ సేవలను అందిస్తున్నామన్నారు. గాయత్రి నిర్భయ సేవింగ్ ఖాతా ద్వారా లక్ష రూపాయల ప్రమాద బీమా సౌకర్యాన్ని అందిస్తున్నామన్నారు. ఈ ఆర్థిక సంవత్సరాంతానికి మరో 16 బ్రాంచీలను ప్రారంభించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని, తద్వారా 66 బ్రాంచీలకు చేరుకుంటామన్నారు. ఇటీవల మృతి చెందిన ఖాతాదారుడికి ప్రమాద బీమా పథకం ద్వారా లక్ష రూపాయల చెక్కును కలెక్టర్ కుటుంబ సభ్యులకు అందించారు. బ్యాంకు జనరల్ మేనేజర్ శ్రీలత, రీజినల్ మేనేజర్ బింగి తిరుపతి, బ్యాంకు పాలక వర్గ సభ్యులు ముత్యాల లక్ష్మారెడ్డి, ఎం. సౌజన్య, ఎ. రాజిరెడ్డి, ఎ సత్యం, అశోక్, కె. శ్రీనాథ్, బి. విజయ్, జి. గంగాధర్, వి. మాధవి, అర్ సతీష్, ఎస్ రవి కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన



రంగపేటలో అవగాహన కల్పిస్తున్న కళాకారులు

గర్మిళ్ల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని రంగపేట, దొరగారిపల్లె, రాజీవ్‌నగర్‌లలో సోమవారం తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రజలకు పాటల ద్వారా అవగాహన కల్పించారు. ఉచిత కరెంటు, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, సబ్సిడీ గ్యాస్, ఉద్యోగాలు, కుల గణనపై ప్రజలకు పాటల ద్వారా అవగాహన కల్పించారు. కళాకారులు మురళి, పోశం, రవికుమార్, కొప్పర్తి రవీందర్, సత్యనారాయణ, నిరోషా పాల్గొన్నారు.

హాజీపూర్, (ఆంధ్రజ్యోతి): దొనబండ, సబ్బేపల్లి గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలపై తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు ఆటా,పాటల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. కళాకారులు లావుడ్య రమేష్, కృష్ణ, రాజా , తిరుపతిలు తెలిపారు.

అనారోగ్యంతో 64 గొర్రెలు మృతి



పోస్టుమార్టం చేస్తున్న పశువైద్యాధికారిని శాంతిరేఖ

హాజీపూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): హాజీపూర్ మండలం నం నూరు గ్రామంలో 64 గొర్రెలు మృతి చెందాయి. గోపు రమేష్, రాజ్‌కుమార్, మల్లేష్, కొము రయ్యలు ఆదివారం గొర్రెలను మేతకు తీసుకువెళ్లి సాయంత్రం ఇంటికి తీసుకువచ్చారు. రాత్రి ఆకస్మాత్తుగా అస్వస్థతకు గురై 30 గొర్రెలు మృతిచెందాయి. రైతులు సోమవారం ఉదయం మండల పశువైద్యాధికారి శాంతిరేఖకు సమాచారం ఇచ్చారు. అస్వస్థతతో ఉన్న గొర్రెలకు ఉదయం చికిత్స చేయగా సోమవారం సాయంత్రం మరో 34 గొర్రెలు మృతిచెందాయి. గొర్రెలకు పోస్టుమార్టమ్ చేయగా అధిక మొత్తంలో వడ్లు తినడం వల్ల ఆసిడోసిస్‌తో చనిపోయాయని పశువైద్యా ధికారి ప్రాథమికంగా నిర్ధారించారు. నమూనాలు సేకరించి ఆదిలాబా ద్‌లోని ఎనిమల్ డీజీస్ డైగ్నోస్టిక్ ల్యాబ్‌కు పంపించామని మండల పశువైద్యాధికారి తెలిపారు. చనిపోయిన గొర్రెల విలువ సుమారు రూ.6 లక్షలు ఉంటుందని తెలిపారు.

బెటాలియన్‌ను సందర్శించిన డీఐజీ



మొక్క నాటుతున్న టీజీఎస్‌పీ బెటాలియన్స్ డీఐజీ షర్ఫుద్దీన్ సిద్దిఖీ

హాజీపూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గుడిపేట 13వ బెటాలియన్‌ను టీజీఎస్‌పీ బెటాలియన్స్ డీఐజీ షర్ఫుద్దీన్ సిద్దిఖీ సోమవారం సందర్శించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ఆయన పర్యటించారు. ఆయనకు కమాండెంట్ వెంకటరాములు స్వాగతం పలకగా పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం డీఐజీ ప్రధాన కార్యాలయం ఆవరణలో మొక్క నాటారు. పలు విభాగాలను తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. విధి నిర్వహణలో ప్రతీ ఒక్కరు అంకితభావంతో పనిచేయాలని పేర్కొన్నారు. అసిస్టెంట్ కమాండెంట్ కాళిదాసు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాజెక్టులో చేప పిల్లలు విడుదల



ప్రాజెక్టులో చేప పిల్లలు వదులుతున్న మత్స్యశాఖ అధికారులు

హాజీపూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముల్కల్ల గ్రామంలోని ర్యాలీవాగు ప్రాజెక్టులో సోమవారం చేప పిల్లలు వదిలారు. సుమారు 2లక్షల22 వేల చేప పిల్లలను వదిలినట్లు మత్స్యశాఖ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ రాంధన్, ఇరిగేషన్ వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌లు తెలిపారు. కార్యదర్శి శ్రీనివాస్, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు పాల్గొన్నారు

బీసీ ఐక్య సదస్సును విజయవంతం చేయండి

శ్రీరాంపూర్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల రద్దు, బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు, తదితర డిమాండ్లతో ఈ నెల 30న మంచిర్యాలలో నిర్వహించే బీసీ ఐక్య సదస్సును విజయవంతం చేయాలని బీసీ సంఘాల జేఏసీ నాయకులు పేర్కొన్నారు. నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కుల గణన పూర్తి చేసి బీసీ రిజర్వేషన్లు పెంచాలని, కేంద్ర ప్రభుత్వం జనాభా లెక్కల సందర్భంగా కుల గణన చేపట్టాలని, మహిళా బిల్లులో బీసీ మహిళల వాటా పెంచాలని, బీసీ యువతకు వడ్డీలేని రుణాలు ఇచ్చి ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. మనోహర్, రంగు రాజేశం, గోపతి మల్లేష్, కనుకుంట్ల మల్లయ్య, పెట్టం లక్ష్మణ్, పాల్గొన్నారు.

ఎఫ్ఆర్‌సీ కమిటీ సభ్యుల ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న ఎఫ్ఆర్‌సీ కమిటీ సభ్యులు

కాసిపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కొత్త తిర్మలాపూర్‌లో సోమవారం ఎఫ్ఆర్‌సీ కమిటీ సభ్యులు సమావేశం నిర్వహించారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్ కవిత మాట్లాడుతూ ఆదివాసీలకు అటవీ ఉత్పత్తులపై హక్కులు కల్పించేందుకు గ్రామసభలు, ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అడవిలో పశువులను మేపు కోవడం, చిన్న తరహా అటవీ ఉత్పత్తులు, అటవీ సంపదపై, పోడు భూములపై హక్కు పీవీటీజీలకు ఉందన్నారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. పీవీటీజీ నాయకులు టేకం శ్రీనివాస్, భగవంతరావు, ఆత్రం సంతోష్, శంకర్ పాల్గొన్నారు.

వర్గీకరణ సాధించే వరకు పోరాటం ఆగదు

దండేపల్లి, నవంబరు25(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ సాధించే వరకు ఎమ్మార్పీఎస్ పోరాటం ఆగదని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శనిగారపు మురళీకృష్ణ అన్నారు. సోమవారం దండేపల్లిలో కార్యాలయాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం మరచి పోయిందన్నారు. మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఉద్యమ పోరాటానికి కార్యాచరణ చేపడుతున్నామన్నారు. లింగంపల్లి బాపు, కొల్లూరి రవికుమార్, మంతెన నవీన్‌కుమార్, ఆవుల శ్రీనివాస్, సత్యం, నరేష్, పాల్గొన్నారు.

మాలల సింహ గర్జన పోస్టర్ల విడుదల

కాసిపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను రద్దు చేయాలని డిసెంబరు 1న హైద్రాబాద్‌లో చేపట్టిన మాలల సింహ గర్జన పోస్టర్లను సోమవారం కాసిపేటలో మాల మహానాడు జేఏసీ కన్వీనర్ తొగరు సుధాకర్ విడుదల చేశారు. ఎస్సీ వర్గీకరణను వెంటనే రద్దు చేయాలని ఆందోళనలు చేస్తున్నామన్నారు. సభకు మాలలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. సంఘం కో కన్వీనర్ గజెల్లి లక్ష్మణ్, మాల సంఘం నాయకులు సమ్మయ్య, బన్న లక్ష్మణ్ దాస్, పొట్ట మధుకర్, సుధీర్, రాజేష్, కనకరాజు, మల్లేష్, పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో అక్షరాభ్యాసం

తాండూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని గర్భిణీలు, పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రమాదేవి పేర్కొన్నారు. సోమవారం మాదారం 3 అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాలను నిర్వహించారు. పిల్లల చేత అక్షరాభ్యాసం చేయించారు. ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా నాణ్యమైన పౌష్టికాహారం అందుతుందన్నారు. టీచర్లు మీనా, గర్భిణీలు పాల్గొన్నారు.

సీఐటీయూ నిరసన

తాండూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కేంద్రం అవలంబిస్తున్న రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సోమవారం తాండూర్ ఐబీలో సీఐటీయూ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దాగం రాజారాం మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందన్నారు. దీన్ని వ్యతిరేకిస్తూ చేసే పోరాటాల్లో కార్మికులు, రైతులు, ప్రజలు కలిసి రావాలన్నారు.

సంస్థాగత ఎన్నికల ప్రక్రియపై సమావేశం

వేమనపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వేమనపల్లి బీజేపీ కార్యాలయంలో సోమవారం మండల అధ్యక్షుడు ఏట మధుకర్ ఆధ్వర్యంలో బూత్‌స్థాయి ఎన్నికల ప్రక్రియ సంస్థాగత సమావేశం నిర్వహించారు. మధుకర్ మండలంలోని అన్ని పోలింగ్ బూత్‌లో క్రియాశీల సభ్యత్వం పూర్తి చేసుకుని ఎన్నికల ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలన్నారు. ప్రతి పోలింగ్ బూత్‌లో 11 మందితో కమిటీ వేయాలని తెలిపారు. నాయకులు వెంకటేష్, దుర్గం పుల్లయ్య, కోయిల స్వామి, తిరుపతి, సమ్మయ్య, శంకర్, భీమేష్, అనుదీప్ తదితరులు పాల్గొన్నారు.

టీఎంఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక

జన్నారం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): టీఎంఎఫ్ మండల కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా సభ్యులు జాడి రాజన్న తెలిపారు. మండల అధ్యక్షుడిగా సదానందం, ప్రధాన కార్యదర్శిగా తిరుపతి, ఉపాధ్యక్షులుగా రజితరాణి, అంజన్న, కోశాధికారిగా గోవర్ధనాచారి, కార్యదర్శిగా దేవిసింగ్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు విద్యాసాగర్, విజయ్‌కాంత్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ట్రాక్టర్ ఢీకొని యువకుడి మృతి



షేక్ రిహాన్(ఫైల్)

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్డు వద్ద ట్రాక్టర్ ఢీకొని పట్టణంలోని రాజంపేటకు చెందిన షేక్‌రిహాన్(17) మృతి చెందాడు. రాజంపేటకు చెందిన షేక్ సలీం కుమారుడు షేక్ రిహాన్ ఉదయం బైక్‌లో పెట్రోల్ పోయించుకోవడానికి బైపాస్ రహదారి నుంచి వెళ్తుండగా రాంగ్‌రూట్‌లో వస్తున్న ట్రాక్టర్ బైక్‌ను ఢీకొంది. దీంతో రిహాన్ అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం ట్రాక్టర్ ఆటోను ఢీకొట్టింది. అందులో ప్రయాణిస్తున్న ముగ్గురు మహిళలకు స్వల్ప గాయాలైనట్లు తెలిపారు. డ్రైవర్ వసాకే లోకాజీని అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రవీందర్ తెలిపారు.

ఏఎస్సై ఇంట్లో చోరీ



బీరువా తాళాలు పగలగొట్టిన దొంగలు

సిర్పూర్(టి), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆదివారం రాత్రి ఏఎస్సై ఇంట్లో చోరీ జరిగింది. సిర్పూర్(టి) మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్ కాలనీలో కౌటాల పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఎస్సై సాయిబాబా నివాసముంటున్నారు. ఆదివారం సాయంత్రం ఆయన డ్యూటీకి వెళ్లారు. రాత్రి ఎనిమిది గంటల సమయంలో ఏఎస్సై భార్య పక్కనే ఉన్న బంధువుల ఇంటికి వెళ్లింది. ఈ సమయంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగలు చొరబడి బీరువా తాళాలు పగులగొట్టి 2.5 తులాల బంగారం అపహరించుకుపోయారు. అనంతరం కొద్దిసేటికి వచ్చిన ఆమె బీరువాలో దుస్తులు చిందరవందరగా పడి ఉండడం చూసి కంగారు పడింది. బీరువాలో ఉన్న బంగారం ఎత్తుకెళ్లారని గమనించి కేకలు వేయగా ఇరుగుపొరుగు వారు వచ్చి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ రమేష్, ఎస్సై కమలాకర్ సంఘటన స్థలానికి చేరుకుని డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేపట్టారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ



వివరాలు సేకరిస్తున్న ఎస్సై

మంచిర్యాల అర్బన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని చింతపందువాడలో తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో సోమవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. ఇంటి యజమానులు సంధ్యారాణి-దిలీప్‌కుమార్ కుటుంబసభ్యులతో కలిసి ఈనెల 20న ఇంటికి తాళం వేసి తీర్థయాత్రలకు వెళ్లారు. ఇంటికి తాళం వేసి ఉండటాన్ని గమనించిన గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి బీరువా పగలగొట్టి తులంన్నర బంగారాన్ని దొంగిలించినట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు. ఇంటి తాళం పగిలి ఉండడంతో సంధ్యారాణి సోదరుడు వెంకటేశ్వర్లు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. అతడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రేమ పేరుతో మోసగించిన వ్యక్తికి జైలు శిక్ష

లక్షెట్టిపేటరూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో యువతిని నమ్మించి శారీరకంగా వాడుకుని పెండ్లికి నిరాకరించిన వ్యక్తికి లక్షెట్టిపేట న్యాయస్థానం రెండు సంవత్సరాల జైలు శిక్ష, రూ.1500 జరిమానా విధించింది. ఎస్ఐ సతీష్ తెలిపిన వివరాల ప్రకారం లక్షెట్టిపేట మున్సిపాలిటీ పరిధిలోని ఆంధ్రబోర్ ప్రాంతానికి చెందిన ఎట్టం అరుణ్ దౌడేపల్లి గ్రామానికి చెందిన ఒక యువతిని ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి శారీరకంగా వాడుకుని పెళ్లికి నిరాకరించాడు. బాధితులు 1-11-2017న లక్షెట్టిపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్ఐ సమ్మయ్య కేసు నమోదు చేసి నిందితున్ని కోర్టులో హాజరుపర్చాడు. జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అసదుల్లా షరీఫ్ విచారణ జరిపి నిందితునికి శిక్ష విధిస్తూ తీర్పునిచ్చినట్లు ఎస్ఐ తెలిపారు. కోర్టు కానిస్టేబుల్ వేణు, లైజనింగ్ ఆఫీసర్ గులాం దస్తగిరిలు సాక్ష్యులను ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ అజయ్ ఉల్లం పాల్గొన్నారు.

బెల్టు షాపుల నిర్వాహకుల బైండోవర్

జైపూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కుందారం గ్రామంలో బహిరంగ వేలం ద్వారా మద్యం విక్రయిస్తున్న బెల్టుషాపుల నిర్వాహకులను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ గురువయ్య పేర్కొన్నారు. కుందారంలో అక్రమంగా బహిరంగ వేలం ద్వారా బెల్టు షాపులు నిర్వహిస్తున్నారని గ్రామస్థులు ఫిర్యాదు చేశారన్నారు. సోమవారం బెల్టు షాపులపై సోదాలు చేసి సుమారు రూ. 50 వేల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. బెల్టుషాపులు నిర్వహిస్తున్న బోయినపల్లి సునీల్, దండవేని రాజశేఖర్‌లపై కేసు నమోదు చేసి తహసీల్దార్ వనజారెడ్డి ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు. ఎక్సైజ్ ఎస్ఐలు మనీషా రాథోడ్, శంకర్, కానిస్టేబుళ్లు రాజేంద్ర ప్రసాద్, మహేష్, ప్రసాద్, ఉమారాణిలు పాల్గొన్నారు.

చెట్లపొదలు నరికిన ఏడుగురు అరెస్టు

వేమనపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నీల్వాయి రిజర్వు ఫారెస్టులో పోడు వ్యవసాయం కోసం చెట్ల పొదలు, పొరకలు నరికిన ఏడుగురిని అరెస్టు చేసి సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు నీల్వాయి ఎఫ్ఆర్వో అప్పకొండ తెలిపారు. కొత్తపల్లి గ్రామానికి చెందిన జంబి భీమయ్య, భరత రామయ్య, పోల దుర్గయ్య, చింతల లస్మయ్య, కత్తెర సమ్మయ్య, మానేపల్లి మల్లేష్, జంప మధుకర్‌లు ఆదివారం రిజర్వు ఫారెస్టులో చెట్ల పొదలను నరుకుతుండగా అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎఫ్ఆర్వో మాట్లాడుతూ రిజర్వు ఫారెస్టులో ఎవరైనా చెట్లను, చెట్ల పొదలను నరికినా, వన్య ప్రాణులను వేటాడిన కఠిన చర్యలు తీసుకొంటామని తెలిపారు.

శాంతిభద్రతల పరిరక్షణకే కార్డెన్‌సెర్చ్

కాసిపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణకే కార్డెన్‌సెర్చ్ నిర్వహిస్తున్నామని సీఐ శశిధర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మామిడిగూడెంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. సరైన వాహన పత్రాలు లేని 39 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. సీఐ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు సేవించినా, రవాణా చేసినా చట్టపరంగా కఠిన చర్యలుంటాయన్నారు. అపరిచిత వ్యక్తులు గ్రామాల్లో కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. పలువురు జ్వరాల బారిన పడడంతో గ్రామస్థులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. డాగ్ స్క్వాడ్‌తో ఇండ్లలో తనిఖీలు నిర్వహించారు. కాసిపేట, దేవాపూర్ ఎస్ఐలు ప్రవీణ్‌కుమార్, ఆంజనేయులు, పోలీసులుపాల్గొన్నారు.

కేయూ డిగ్రీ సెమిస్టర్ పరీక్షల రీ షెడ్యూల్

కేయూక్యాంపస్, నవంబరు 25: (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ పరిధిలో నవంబరు 26 నుంచి జరుగాల్సిన డిగ్రీ 1,3, 5వ సెమిస్టర్ పరీక్షలను రీ షెడ్యూల్ చేశామని పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు డాక్టర్ ఎం. తిరుమలదేవి, డాక్టర్ పి. వెంకటయ్యలు సోమవారం వెల్లడించారు.

- ఈనెల 26న జరగాల్సిన డిగ్రీ మొదటి, ఐదవ సెమిస్టర్ బీఏ, బీఏ (లాంగ్వేజెస్)బీబీఏ, బీకామ్, బీఎస్సీ కోర్సుల పరీక్షలు డిసెంబరు 27కు వాయిదా వేశారు.
- ఈనెల 27న జరుగాల్సిన డిగ్రీ మూడవ సెమిస్టర్ బీఏ, బీఏ (లాంగ్వేజేస్)బీబీఏ, బీకామ్, బీఎస్సీ కోర్సుల పరీక్షలన్నీ డిసెంబరు 28కు.
- ఈనెల 28న జరుగాల్సిన డిగ్రీ ఐదవ సెమిస్టర్ బీఏ, బీఏ (లాంగ్వేజేస్)బీబీఏ, బీకామ్, బీఎస్సీ కోర్సుల పరీక్షలన్నీ డిసెంబరు 30కి వాయిదా వేశారు. వీటితో పాటు బీసీఏ మొదటి సెమిస్టర్, మూడవ సెమిస్టర్, ఐదవ సెమిస్టర్ పరీక్షలను రీషెడ్యూల్ చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారులు వెల్లడించారు.

వణికిస్తున్న చలి

- రోజురోజుకు పెరుగుతున్న చలి తీవ్రత
- 13డిగ్రీలకు పడిపోయిన రాత్రి ఉష్ణోగ్రతలు
- జాగ్రత్తలు అవసరం అంటున్న వైద్యులు

చింతలమానేపల్లి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం శీతాకాలం కావడంతోపాటు ఉత్తరాది ప్రాంతం నుంచి వీస్తున్న చలిగాలుల ప్రభావంతో జిల్లాలో చలి తీవ్రత క్రమంగా పెరుగుతోంది. దీంతో మధ్యాహ్న వేళల్లో మినహా మిగితా సమయాల్లో ఎండప్రభావం అంతగా ఉండడం లేదు. పల్లెల్లో తెల్లవారుజామున కురుస్తున్న పొగమంచుతో బయటకు వెళ్లేందుకు ప్రజలు జంకుతున్నారు.



చింతలమానేపల్లిలో..

పెరుగుతున్న చలి, పొగ మంచు తీవ్రతతో ప్రజలకు ఉదయం 9గంటలు దాటితే కానీ బయటకు రాలేని పరి స్థితులు ఏర్పడుతున్నాయి. మండలంలో రాత్రి ఉష్ణోగ్రతలు 13డిగ్రీలకు పడిపోయాయి. పలువురు ఉన్నిదుస్తులు ధరిస్తూ చలి నుంచి రక్షణ పొందుతున్నారు. తెల్లవారు జామున కురుస్తున్న పొగమంచుతో ప్రధాన రహదారులలో వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. మండలంలో పగటి ఉష్ణోగ్రతలు 25 నుంచి 28వరకు, రాత్రి ఉష్ణోగ్రతలు 13 డిగ్రీలకు పడిపోతున్నాయి. రాత్రి ఆరుగంటలు దాటిందంటే చలిపెరుగుతోంది. ప్రజలు చలిమంటలు వేసుకుంటున్నారు.

పాటించాల్సిన జాగ్రత్తలు..

చలికాలంలో సాధారణంగా దగ్గు, జలుబు వస్తుందని ప్రజలు జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. దగ్గు, జలుబు, జ్వరం, గొంతు నొప్పి, శ్వాసకోస సంబంధిత సమస్యలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచిస్తున్నారు. చలితీవ్రత పెరుగుతున్నం దున పిల్లలు, వృద్ధులు ఉదయం, రాత్రి వేళల్లో బయటకు వెళ్లక పోవడమే మంచి దంటున్నారు.

సిర్పూర్(యు)లో 8.3డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత



ఆసిఫాబాద్‌లో చలిమంట కాగుతున్న ప్రజలు



ఆసిఫాబాద్ రూరల్: సోమవారం రాష్ట్రంలోనే సిర్పూర్ (యు) మండలంలో 8.3డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదయింది. మిగితా మండ లాలైన కెరమెరిలో 10డిగ్రీలు, లింగాపూర్‌లో 10.1డిగ్రీలు, వాంకిడిలో 11.1డిగ్రీలు, ఆసిఫా బాద్, తిర్యాణిలో 11.5డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వారం రోజులుగా ఉష్ణోగ్రతలు తగ్గు ముఖం పట్టడంతో ఏజెన్సీ మండలాల్లోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదు ర్కొంటున్నారు. చలినుంచి ఉపశ మనం పొందేందుకు నెగళ్లు, చలి మంటలు కాగుతున్నారు. మంచిర్యాల జిల్లాలో సోమవారం 11.2డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జిల్లాలోని హాజీపూర్ మండలం ర్యాలీగడ్‌పూర్‌లో 11.2 డిగ్రీలు, జన్నారం మండలం తపాల్‌పూర్‌లో 11.7 డిగ్రీలు, జన్నారం మండల కేంద్రంలో 12.4 డిగ్రీలు, కాసిపేట మండలం కొండాపూర్‌లో 12.6 డిగ్రీలు, దండేపల్లి మండలం లింగపూర్‌లో 12.9 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

సంతూర్ స్కాలర్ షిప్‌నకు ఎంపికైన విద్యార్థినులు



మంజూరు పత్రాలతో విద్యార్థినులు

కౌటాల, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీచైతన్య డిగ్రీకళాశాలలో చదువుతున్న 18మంది విద్యార్థినులు సంతూర్ ఉమెన్స్ స్కాలర్‌షిప్‌నకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు ఇలాంటి స్కాలర్‌షిప్ ఉన్నతచదువులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. విప్రోసంతూర్ వారికి కరస్పాండెంట్ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్‌లు కృతజ్ఞతలు తెలిపారు.

ఉద్యమ నేతకు నివాళులు

బెజ్జూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): తుడుందెబ్బ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సంజీవ్ అకాల మరణం ఆదివాసీ సంఘానికి తీరనిలోటని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ జిల్లా ప్రధానకార్యదర్శి ఆత్రం బక్కయ్య అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని ఆదివాసీ భవన్‌లో ఆయన మృతిపట్ల సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీ ప్రజలకు 30 సంవత్సరాలుగా విశేష సేవలందించి అనేకఉద్యమాలు నడిపి సమస్యల కోసం పోరాటంచేసిన సంజీవ్‌ని కోల్పోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో నాయకులు సకారాం, తిరుపతి, శంకర్, మల్లేష్, సతీష్, ప్రశాంత్ పాల్గొన్నారు.



నివాళులు అర్పిస్తున్న ఆదివాసీ నాయకులు

సెపక్‌తక్రా రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సభ్యురాలిగా శిరీష



శిరీష

రెబ్బెన, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): సెపక్‌తక్రా రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సభ్యురాలిగా పర్లపల్లి శిరీష ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సెపక్‌తక్రా రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఆర్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. గోలేటివాసి అయిన శిరీష ప్రస్తుతం గన్నారం బీసీవెల్ఫేర్ స్కూల్‌లో పీడీగా పనిచేస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్‌నుంచి అంతర్జాతీయ స్థాయిలో ఆడిన ఏకైక మహిళ ఆమె. ఈ సందర్భగా ఆమెను ఆదిలాబాద్ జిల్లా ఒలింపిక్ వైస్‌ప్రెసిడెంట్ ఆర్ నారాయణ రెడ్డి, కార్యవర్గసభ్యులు భాస్కర్, తదితరులు అభినందించారు.

కాగజ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు బారికేడ్స్ అందజేత

కాగజ్‌నగర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు బారికేడ్స్‌ను క్రెడిట్ ఆక్సెస్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణసీఐ రాజేంద్ర ప్రసాద్‌కు అందజేశారు. అనంతరం సీఐ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ బారికేడ్స్ ఏర్పాటుకు సహరించిన క్రెడిట్ ఆక్సెస్ ఇండియా ఫౌండేషన్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో డివిజనల్ మేనేజర్ ఎం చంద్రశేఖర్, ఎస్సై సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై ప్రత్యేక సమావేశం

బెజ్జూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఓటరు నమోదుపై మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో గౌరీశంకర్ తెలిపారు. సమావేశానికి మండలంలోని అన్నిపార్టీల నాయకులు హాజరుకావాలని సూచిం చారు.

పోగొట్టుకున్న సెల్ ఫోన్స్ అందజేత



సెల్ ఫోన్ అందజేస్తున్న ఎస్సై

వాంకిడి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన ముగ్గురు వ్యక్తులు గతనెలలో పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను సోమవారం బాధితులకు అందజేసినట్లు ఎస్సై ప్రశాంత్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం గతనెలలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ముగ్గురు తమ మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్నట్లు ఫిర్యాదు చేయడంతో సీఈఐఆర్ పోర్టల్‌ని ఉపయోగించి పోయిన మొబైల్ ఫోన్లను రికవరీ చేసి సోమవారం బాధితులకు అందజేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

గ్రూపు-4లో ఉద్యోగం సాధించిన యువకుడికి సన్మానం



అనిల్‌కుమార్‌ను సన్మానిస్తున్న పాఠశాల సిబ్బంది

వాంకిడి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రూపు-4లో ఉద్యోగంసాధించిన మండలంలోని అర్లిగ్రామానికి చెందిన ఆడె అనిల్ కుమార్‌ను సోమవారం సాయిగోపాల పాఠశాలలో సన్మానించారు. ఈసందర్భంగా శాలువాతో సత్కరించి మిఠాయిలు తినిపించారు. సాయిగోపాల పాఠశాలలో చదువుకొని ఉద్యోగం సాధించడం అభినందనీయమని ప్రధానోపాధ్యాయుడు సంతోష్ అన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సొంత ఖర్చులతో పిచ్చి మొక్కల తొలగింపు

కెరమెరి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనార్‌పల్లి గ్రామానికి చెందిన రాథోడ్ వెంకట్‌రాంనాయక్ సొంతనిధులతో గ్రామానికివెళ్లేదారికి ఇరువైపులా, రోడ్డుపక్కన ఉన్న ముళ్లపొదళు, పిచ్చిమొక్కలను తొలగించారు. లక్మాపూర్ ఎక్స్ రోడ్డు నుంచి అనార్‌పల్లి మీదుగా కెరమెరి ఎక్స్ రోడ్డు వరకు బ్లేడ్ ట్రాక్టర్‌తో చదును చేయించారు.



పాన్‌కార్డుతో ఆధార్‌ను అనుసంధానం చేసుకోవాలి: జీఎం



సమావేశంలో మాట్లాడుతున్న జీఎం శ్రీనివాస్

రెబ్బెన, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఉద్యోగుందరూ ఆదాయపన్ను శాఖ నిబంధన మేరకు తమ పాన్‌కార్డును ఆధార్‌కార్డుతో అనుసంధానం చేసుకోవాలని బెల్లంపల్లి ఏరియా జీఎం శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదాయ పన్ను నిబంధన ప్రకారం పాన్‌కార్డు తప్పకుండా సమర్పించాలన్నారు. లేనిపక్షంలో 20శాతం వరకు పెనాల్టీ పడుతుందన్నారు.

రక్షణ పక్షోత్సవాలు ఘనంగా చేపట్టాలి..

బెల్లంపల్లి ఏరియాలో 55వ వార్షిక రక్షణ పక్షోత్సవాలు ఘనంగా చేపట్టాలని జీఎం శ్రీనివాస్ తెలిపారు. సోమవారం స్థానికంగా ఆయన మాట్లాడారు. డిసెంబరు 9నుంచి 21వరకు చేయాల్సిన ఏర్పాట్లపై వివరించారు. ఈ పక్షోత్సవాల్లో ప్రతి ఉద్యోగి సేఫ్టీ మేనేజ్‌మెంటు ప్లాన్ పూర్తిగా చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌వోటు జీఎం రాజమల్లు, ఏరియా ఇంజనీర్ భీంరావు జాడే, ప్రాజెక్టు ఇంజనీర్ వీరన్న, డీజీఎం(వర్క్ షాప్) కృష్ణమూర్తి, సివిల్(ఎస్ఇ) మదీనా భాషా, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

కార్మికులకు వార్మ్‌కోట్లు అందించాలి

శ్రీరాంపూర్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికులకు వార్మ్‌కోట్లు అందించాలని టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, ఏరియా ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్ కోరారు. ఈ మేరకు వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రతి ఏడాది సెప్టెంబర్ నెలలోనే ఇవ్వాల్సిన కోట్లు ఇంతవరకు అందించకపోవడం బాధాకరమన్నారు. ప్రస్తుతం చలి తీవ్రత ఎక్కువగా ఉందని, దీనివల్ల కార్మికులు అనారోగ్యం పాలయ్యే అవకాశం ఉందన్నారు. ఉద్యోగుల రక్షణ, భద్రత దృష్ట్యా యాజమాన్యం వార్మ్‌కోట్లు అందించాలని డిమాండ్ చేశారు.

సులభ్ కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలి

మందమర్రిటౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సింగరేణివ్యాప్తంగా సులభ్ కాంప్లెక్స్ కార్మికులు అనేకసమస్యలతో సతమతమవుతున్నారని ఐఎఫ్‌టీయూ బెల్లంపల్లి రీజియన్ అధ్యక్షుడు జాఫర్ పేర్కొన్నారు. సోమవారం ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ 30సంవత్సరాలుగా సులభ్ కాంప్లెక్సులను పరిశుభ్రం చేస్తూ అనారోగ్యాల బారినపడుతున్నా వారికి కనీసహక్కులు అమలు కాకపోవడం సరైంది కాదన్నారు. కాంట్రాక్టర్లు, సింగరేణి యామాన్యం వీరిపట్ల నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. వీరి హక్కుల సాధనకోసం ఈనెల27నఛలో కొత్తగూడెం కార్యక్రమం తలపెట్టామన్నారు. కార్యక్రమానికి సులభ్‌కార్మికులు పెద్దసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మహేశ్వరి, సునీత, అజయ్, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

27న సింగరేణి ప్రధాన కార్యాలయం ముట్టడి

శ్రీరాంపూర్: ఈ నెల 27న సింగరేణి ప్రధాన కార్యాలయం ముట్టడించనున్నట్లు సులభ్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు డి. బ్రహ్మానందం తెలిపారు. సోమవారం ఆయన శ్రీరాంపూర్‌లోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో మాట్లాడారు. సులభ్ ఇంటర్నేషనల్ సంస్థలు కార్మికులకు సౌకర్యాలు కల్పించడంలో విఫలమయ్యాయని ఆరోపించారు. 15ఏళ్లుగా సింగరేణి వ్యాప్తంగా సులభ్ కార్మికులకు ఈఎస్ఐ, ఈపీఎఫ్, బోనస్, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయం ముట్టడిని విజయవంతం చేయాలని కార్మికులను పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు నేదూరి నరసయ్య, మంతెన లక్ష్మయ్య, రాజేందర్, సదానందం, సోమయ్య, సుగుణ, దివ్య, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జాఫర్

జీవోలను సవరించి వేతనాలు వెంటనే పెంచాలి



నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

శ్రీరాంపూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమలకు చెందిన 73షెడ్యూల్డ్ జీవోలను సవరించి కాంట్రాక్టుకార్మికులకు వేతనాలు పెంచాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ కార్మికుల సంఘం (సీఐటీయూ) డివిజన్ కార్యదర్శి గట్టు మహేందర్ పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్త నిరసనలో భాగంగా శ్రీరాంపూర్ ఓసీపీలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మికులకు చెందిన చట్టాలను సవరించడం వల్ల వారు తీవ్రంగా నష్టపో తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే జీవోలను సవరించి వేతనాలు పెంచాలని కోరారు. కార్యక్రమంలో కన్వేయన్స్ డ్రైవర్స్ యూనియన్ పిట్ అధ్యక్షుడు కాసిపేట రాజేశం, సంపతి, సమ్మన్న, నరేష్, శ్రీనివాస్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నియామకం

జైపూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కాలరీస్ బీసీఉద్యోగుల సంక్షేమ సంఘం ఐకే ఓసీపీ కన్వీనర్‌గా పెంటం శ్రీనివాస్, కోకన్వీనర్‌గా సిలువేరు సంపత్, ఐకే1ఏగని కన్వీనర్‌గా దిడ్డిరమేష్, కోకన్వీనర్‌గా ఈర్లసతీష్‌ను నియమించినట్లు సంఘంనాయకులు మారుతి, బద్రి బుచ్చయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ ఉద్యోగులు ఐక్యంగా ఉండి హక్కుల సాధన కోసం పనిచేయాలన్నారు.

సమస్యలు పరిష్కరించకపోతే సమరశీల పోరాటాలు

మందమర్రిటౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కార్మికులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పరిష్కరించకపోతే సమరశీల పోరాటాలు తప్పవని గుర్తింపు సంఘం ఏరియా కార్యదర్శి భీమనాథుని సుదర్శన్ పేర్కొన్నారు. సోమవారం ఏరియా స్టోర్‌లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై అధికారులకు వినతి పత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యలను యాజమాన్యం వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈనెల 28న కొత్తగూడెంలో స్ట్రక్చర్ సమావేశం జరుగుతుందని, ఇందులో కార్మికుల సమస్యలపై ప్రశ్నిస్తామన్నారు. అలాగే కార్మికుల సొంతింటి కలపై వివరిస్తామని తెలిపారు. ఏరియాలో కూడా స్ట్రక్చర్ సమావేశాలు నిర్వహించాలని పేర్కొంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజేశ్వర్‌రావు, శర్మ, తిరుపతి, సదానందం, రామకృష్ణ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం నిల్వ చేసేదెలా..?

5వ పేజీ తరువాయి..

అధికారులు ఉన్నారు. మిగతా ధాన్యం నిలువ చేసేందుకు ప్రైవేటు భవనాలు ఏర్పాటు చేస్తుండగా, ఇంకా మిగిలిన దాన్ని ఇతర జిల్లాలకు తరలించి నిలువ చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు. అయితే అన్ని జిల్లాలోనూ సీఎంఆర్ పెద్ద మొత్తంలో పెండింగులో ఉంది. ఈ క్రమంలో ఇతర జిల్లాల్లో ధాన్యం ఎలా నిలువ చేస్తారో అధికారులకే తెలియాలి.

కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాప్యం..

ధాన్యాన్ని నిలువ చేసేందుకు ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో కొనుగోళ్లు చేపడితే సమస్య జటిలం అవుతుందనే ఉద్దేశ్యంలో అధికారులు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాప్యం చేస్తున్నట్లు సమాచారం. వానాకాలం సీజన్‌కు సంబంధించి జిల్లాలో ధాన్యం సేకరణకు మొత్తం 326 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అందులో ఇప్పటి వరకు 303 సెంటర్లు ప్రారంభించారు. ఇప్పటి వరకు 2323 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు.

ఇదిలా ఉండ గా రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు చేర్చి అక్కడే ఆరబెడుతున్నారు. రోజుల తరబడి కొనుగోళ్లు చేపట్టక పోవడంతో అకాల వర్షాలు కురిస్తే పరిస్థితి ఏమిటనే ఆందోళనలో రైతులు ఉన్నారు. తక్షణమే ధాన్యం కొను గోళ్లు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు ఎలాంటి కేసులు లేని 27 మిల్లులను కూడా ఎంపిక చేయాలని రైస్‌మిల్లర్లు కోరుతున్నారు. మిల్లు ల సామర్థ్యాన్ని బట్టి ఎన్ని మెట్రిక్ టన్నుల ధాన్యం దింపుకుంటారో దాని విలువ ప్రకారం బ్యాంకు గ్యారెంటీ ఇచ్చేందుకు మిల్లర్లు సిద్ధంగా ఉన్నారు. సివిల్ సప్లయిస్ శాఖతో అగ్రిమెంట్ పూర్తిచేస్తే నిబంధనల మేరకు ధాన్యం దించుకుంటామని చెబుతున్నారు.

అథ్లెటిక్స్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



మెడల్స్ సాధించిన విద్యార్థులు

బెల్లంపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో అండర్ 8, 10, 12 విభాగాల్లో పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. వరుణ్‌కుమార్ బ్రాడ్ జంప్‌లో గోల్డ్‌మెడల్, 50 మీటర్ల పరుగు పందెంలో బ్రాంజ్ మెడల్ సాధించారు. నిరూప్ జావలిన్‌త్రోలో బ్రాంజ్ మెడల్, సహస్య జావెలిన్‌త్రోలో సిల్వర్ మెడల్ సాధించారు. వీరిని పాఠశాల డైరెక్టర్ రవి ప్రసాద్, ప్రిన్సిపాల్ రాజారమేష్, వ్యాయామ ఉపాధ్యాయులు మల్లేష్ యాదవ్, సంతోష్‌లు సోమవారం పాఠశాలలో అభినందించారు.

రైతన్నకు అభయమిచ్చే పెద్దయ్య దేవుడు



- చారిత్రక ప్రాశస్త్యం పెద్దయ్య..చిన్నయ్య ఆలయం
- ఏకైక పాండవుల దేవాలయం..
- పెద్దయ్య ఆలయాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి



దేవతమూర్తులు

దండేపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి 12 కిలోమీటర్ల దూరంలో ఉన్న పెద్దయ్య దేవుని ఆలయం ప్రకృతి అందాలు, ఎన్నో వింతలు, విశేషాలు కలిగి ఉంది. పెద్దయ్య దేవుడిని దర్శించుకునేందుకు రైతులు వానాకాలంలో వరికోతలు ప్రారంభంతో మొదలు యాసంగి పనులు ఊపందుకునే వరకు వస్తారు. ద్వాపర యుగంలో పాండవులు అరణ్యవాసం చేసేటప్పుడు ఈ కొండల్లోనే తలదాచుకున్నారని, పెద్దయ్య అంటేనే పాండవుల్లో పెద్ద వాడైన ధర్మరాజు.. అందుకే దీనిని పెద్దయ్య దేవుడిగా పెద్దయ్య గుట్టగా పిలుస్తారని పురాణ గాథల ద్వారా తెలుస్తోంది.

పెద్దయ్య ఆలయ విశిష్టత..

గుట్టపై పెద్దయ్య ఆలయం సమీపంలో కోనేరు ఉంది. అందులో ఏ కాలమైనా నీరు ఉంటుంది. మొదట కోనేరులో స్నానాలు చేసి, ఆలయాన్ని సందర్శిస్తే కోరిన కోరికలు తీరుతాయని నమ్మకం. పెద్దయ్య గుట్ట నుంచి లక్షెట్టిపేట మండలంలోని చిన్నయ్య గుట్ట వరకు సొరంగ మార్గం ఉందని పెద్దలు చెబుతారు. భక్తులు ముందుగా అక్కడ ఉన్న "గజ్జిబండ" వద్ద పూజలు చేస్తారు. భక్తులు వెంట తెచ్చే బియ్యం, కోడిగుడ్లు, నగదును గజ్జిబండ వద్ద పెట్టి పూజల అనంతరం కాలి నడకన పెద్దయ్య ఆలయానికి వెళ్లి దర్శించుకొంటారు.

రైతుల కొంగు బంగారం పెద్దయ్య...


పెద్దయ్య గుట్ట దేవాలయం రైతుల కొంగు బంగారంగా ప్రసిద్ధి గాంచింది. ఖరీఫ్, రబీ సీజన్‌లో రైతులు, వేసవిసెలవుల్లో భక్తులు ఆది, గురువారాలల్లో దర్శనం కోసం వస్తుంటారు. పలు జిల్లాలతోపాటు మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు, రైతులు తరలివస్తారు. కోనేటిలోని నీటిని పెద్దయ్య స్వామి తీర్థంగా ఇండ్లకు తీసుకవెళతారు. పెద్దయ్య దేవుని ఇల్లారి చిన్న కుటీరం మాదిరిగా ఉంటుంది. ఈ కుటిరంలో గిరిజనులు(నాయక్‌పోడ్) పూజారులుగా వ్యవహరిస్తారు. భక్తులు కోనేరులో స్నానం చేసి తడి బట్టలతో రాగానే పూజారి పెద్దయ్య దేవుని పునకంతో ఊరగోలతో కొడితే పెళ్లి కాని వారికి పెండ్లి అవుతుందని, సంతానంలేని వారికి సంతానం కలుగుతుందనేది భక్తుల విశ్వాసం.

ఆలయానికి రోడ్డు సౌకర్యం కల్పించాలి

కవ్వాల్ అభయారణ్యంలోని దట్టమైన అటవీ ప్రాంతంలో ఉన్న పెద్దయ్య దేవుని ఆలయానికి రోడ్డు సౌకర్యం లేకపోవడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. అటవీ ప్రాంతంలో సుమారు 4కిలోమీటర్లు పెద్దయ్య ఆలయం వరకు నడవాల్సి ఉంటుంది. ప్రభుత్వం రోడ్డు సౌకర్యం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి...

దట్టమైన అటవీ ప్రాంతంలో రెండు కొండల నడుమ పెద్దయ్య ఆలయం ఉంది. పెద్దయ్య గుట్టను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలనే డిమాండ్‌లు దశాబ్దాల కాలంగా వినిపిస్తున్నాయి. అందుకు ప్రజాప్రతినిధులు కృషి చేయాలని కోరుతున్నారు.



నిటారుగా ఉన్న గుట్ట

గుడికి ఎదురుగా ఉన్న సుమారు 100 మీటర్ల ఎత్తులో నిటారుగా ఉండే పెద్దయ్య గుట్టను పూజారులే అధిరోహిస్తారు. పెద్దయ్య ఆలయంలో పూజలు చేసి పూజారి గుట్టుపైకి 10 నిమిషాల్లో ఎక్కి కిందకి వస్తారు. గుట్టుపైకి ఎక్కేటప్పుడు కాలుకు ఒక గజ్జెకట్టు కొని ఎక్కి, కిందికి వచ్చేటప్పుడు రెండు కాళ్లకు గజ్జెలు ఉండటాయి. గుట్టు కిందకి వచ్చేప్పుడు భక్తులు కోరికలు ఉంటే కోనేరు స్నానం చేసి బండరాయిపై పూజారికి ఎదురుగా నిలబడి ఆశీర్వాదం తీసుకుంటారు. ఈ ఏడాది ఏ పంటలు పండుతాయి.. చీడపీడలు తదితర వివరాలతో దర్శ నానికి వచ్చిన రైతులకు పూజారి జోస్యం చెపుతారు. పూజారి ఇచ్చే పసుపు, కుంకుమ, తీర్థం రైతుల పొలాల్లో చల్లుకుంటారు.



కొండపైన పూజారీ

న్యూస్ బాక్స్

విద్యార్థిని అభినందించిన ఉపాధ్యాయులు



విద్యార్థిని అభినందిస్తున్న హెడ్మాస్టర్, ఉపాధ్యాయులు

బెల్లంపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జావెలింగ్ త్రో పోటీల్లో పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ పాఠశాలకు చెందిన గౌస్‌ఉద్దీన్ ద్వితీయ బహుమతి సాధించగా సోమవారం పాఠశాలలో విద్యార్థిని అభినందించారు. హెడ్మాస్టర్ చక్రపాణి మాట్లాడుతూ ఈ నెల 23న గుడిపేటలో జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో జావెలింగ్ త్రోలో ద్వితీయ బహుమతి సాధించినట్లు తెలిపారు. ఉపాధ్యాయుడు దుర్గా ప్రసాద్, కోచ్ సంతోష్‌లు పాల్గొన్నారు.

ఆదాయపు పన్ను రద్దుకు కృషి

శ్రీరాంపూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీగా విజయం సాధిస్తే సింగరేణి కార్మికుల ఆదాయపు పన్ను రద్దుకు కృషి చేస్తానని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి, అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి అన్నారు. సోమవారం కోల్‌బెల్ట్ ప్రాంతంలో పర్యటించారు. యువ కార్మికులను కలుస్తూ తనకు ఓటు వేసి ఎమ్మెల్సీగా గెలిపించాలని కోరారు. ఇందారం క్రాస్ రోడ్డు నుంచి ఆర్కే న్యూటెక్ గనిని సందర్శించి మాట్లాడారు. అనంతరం గనిలోనికి దిగి పని స్థలాలను పరిశీలించారు. ట్రస్మా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లెత్తుల రాజేంద్రపాణి, జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రేగల్ల ఉపేందర్, కోశాధికారి కృష్ణారెడ్డి, నాయకులు షైదం రామకృష్ణ, ఉట్ల సత్యనారాయణ, అంబాల్ రాజ్ కువర్, అల్ఫోర్స్ జోనల్ ఇన్‌చార్జి శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్‌తో క్రమశిక్షణ



మాట్లాడుతున్న జీఎం దేవేందర్

మందమర్రిటౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్కౌట్స్‌అండ్ గైడ్స్‌లో చేరడం వల్ల ప్రతి విద్యార్థి క్రమశిక్షణ కలిగి ఉంటారని జీఎం దేవేందర్ తెలిపారు. సోమవారం సింగరేణి పాఠశాల మైదానంలో స్టాండర్డ్ జడ్జింగ్ క్యాంప్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమానికి ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో చేరడం ద్వారా దేశం పట్ల భక్తి శ్రద్ధలతోపాటు స్కౌటింగ్, స్కిల్స్ టీం వర్కు పెరుగుతాయన్నారు. సమాజ అభివృద్ధికి పాటు పడతారని తెలిపారు. మూడు రోజులపాటు జరిగే కార్యక్రమంలో ప్రతీ అంశాన్ని విద్యార్థులు పరిశీలించాలన్నారు. అంతకుముందు స్కౌట్స్ అండ్ గైడ్స్ గౌరవ వందనాన్ని స్వీకరించారు. గోదావరిఖని, శ్రీరాంపూర్, మందమర్రి, గోలేటి నుంచి 60 మంది విద్యార్థులు పాల్గొన్నారు. సింగరేణి పాఠశాల కరస్పాండెంట్, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, హెచ్‌ఎం పురుషోత్తం, మాస్టర్ భాస్కర్, శక్తికుమార్, కృష్ణకుమార్, శ్రీనివాస్, కల్పన, కరిష్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్, (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు క్రీడలు, వివిధ రంగాల్లో రాణించాలని జీఎం దేవందర్ అన్నారు. రామకృష్ణా పూర్ బ్లెస్డ్ ఆల్ఫోన్స కాన్వెంట్ పాఠశాలలో స్పోర్ట్స్ అండ్ కల్చరల్ మీట్ ప్రారంభోత్సవం సందర్భంగా మాట్లాడారు. మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండాలంటే విద్యార్థులకు క్రీడలు దోహద పడతాయన్నారు. పాఠాలు శ్రద్ధగా వింటే ఉన్నత శిఖరాలను అధిగమించవచ్చన్నారు. విద్యార్థులకు ఆటలు, డ్యాన్స్ పాటలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు విద్యార్థుల్లో దాగున్న సృజనాత్మకతను ఉపాధ్యాయులు గుర్తించాలన్నారు. జీఎంను పాఠశాల యాజమాన్యం సన్మానించారు. పర్సనల్ మేనేజర్ శ్యామ్‌సుందర్, పాఠశాల కరస్పాండెంట్ సిస్టర్ జీనారోజ్, బ్లెస్సీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యోగాతోనే ఆరోగ్యం

మందమర్రిటౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): యోగాతోనే ప్రతీ ఒక్కరికి సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. సోమవారం ఆయుష్ ప్రవేశ పెట్టిన ఉచిత యోగా శిక్షణను ప్రారంభించి మాట్లాడారు. ప్రజారోగ్యం కోసమే యోగా శిక్షణను ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. యోగా చేయడం ద్వారా వ్యాధుల నుంచి విముక్తి కలుగుతుందని, దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఉచిత యోగా శిక్షణను ప్రవేశపెట్టిందన్నారు. రోజు ఉదయం 6 నుంచి 7 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 7 వరకు శిక్షణ ఉంటుందన్నారు. డాక్టర్ నీరజ, యోగా గురువు రమేష్, వ్యాపార సంఘం అధ్యక్షుడు వడ్లకొండ కనకయ్య, తుంగపిండి రాజేష్, అబ్బాస్, యోగా శిక్షకులు రామ్మోహన్, శైలజ, రజిత పాల్గొన్నారు.

సౌత్ జోన్ యూనివర్సిటీ టోర్నమెంట్‌కు ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

మంచిర్యాల అర్బన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని నబిలా ఆనం సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌కు ఎంపికైందని ప్రిన్సిపాల్ వి.చక్రపాణి సోమవారం తెలిపారు. ఈ నెల 24న జరిగిన కాకతీయ యూనివర్సిటీ స్థాయి మహిళల బాక్సింగ్ పోటీల్లో నబిలా ఆనం ప్రథమ స్థానంలో నిలిచింది. విద్యార్థిని ప్రిన్సిపాల్, స్పోర్ట్స్ ఇన్‌చార్జి గోపాలకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ నరేందర్‌రెడ్డి, అధ్యాపకులు గంగయ్య, శ్రీధర్, కుమారస్వామి, రాజయ్య, మహేష్, కనకలక్ష్మి, కరుణాకర్ అభినందించారు.

ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌కు ఉపాధ్యాయుడి ఎంపిక



ప్రవీణ్

కాసిపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌కు కాసిపేట మోడల్ స్కూల్‌లో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న జాడి ప్రవీణ్ ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. నవంబర్ 30 నుంచి డిసెంబరు 3 వరకు ఐఐటీ గౌహతిలో జరిగే సైన్స్‌ఫెస్టివల్ ప్రవీణ్ పాల్గొననున్నట్లు తెలిపారు.సైన్స్ టెక్నాలజీ, మినిస్ట్రీస్ ఆఫ్ ఎర్త్ సైన్సెస్ నిర్వహిస్తున్న కార్యక్రమంలో తెలంగాణ నుంచి ప్రవీణ్ పాల్గొనడం అభినందనీయమన్నారు. ఎడ్యుకేషన్ ఫర్ ఆస్పైరింగ్ ఇండియా నేషనల్ సైన్స్ టీచర్ వర్కుషాపు ఆధ్వర్యంలో కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రవీణ్‌ను ఉపాధ్యాయులు అభినందించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

వేమనపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లెడ గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం మాజీ జెడ్పీటీసీ ఆర్.సంతోష్‌కుమార్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోకుండా కొనుగోలు కేంద్రంలో ధాన్యం విక్రయించాలని పేర్కొన్నారు. సింగిల్ విండో చైర్మన్ వెంకటేశం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సాబీర్ ఆలీ పాల్గొన్నారు.

ఆలయాల్లో భక్తుల రద్దీ



గూడెంలో సత్యదేవుడిని దర్శించుకుంటున్న భక్తులు, బుగ్గ ఆలయంలో పూజలు

దండేపల్లి, నవంబరు25 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాస చివరి సోమవారం పురస్కరించుకుని గూడెం సత్యనారాయణ స్వామి ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. ఉదయం గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించి గంగమ్మ తల్లికి పూజలు చేసి దీపాలు వెలి గించారు. అనంతరం ఆలయానికి చేరుకొని 408మంది భక్తులు కుటుంబ సమేతంగా వ్రతాన్ని ఆచరించారు. మహిళలు కార్తీక దీపదానం చేసి ధ్వజస్తంభం, రావి చెట్టు వద్ద ఉసిరి కాయలపై దీపాలు వెలిగించారు.

బెల్లంపల్లి, (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం చివరి సోమవారం కావడంతో బుగ్గ దేవాలయానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజామునే ఆలయానికి చేరుకుని రాజరాజేశ్వర స్వామిని దర్శంచుకుని అభిషేకాలు, పూజలు, కార్తీక దీపాలను వెలిగించారు. దేవాలయానికి వచ్చిన భక్తులకు వరిపేట యువకులు అన్నదానం నిర్వహించారు.

ఉన్ని దుస్తులకు పెరిగిన గిరాకీ



స్వెటర్లను కొనుగోలు చేస్తున్న ప్రజలు

మందమర్రి టౌన్, నవంబర్ 25 (ఆంధ్రజ్యోతి): చలి తీవ్రత పెరగడంతో ఉన్ని దుస్తులకు గిరాకీ పెరిగింది. మందమర్రి మార్కెట్‌లో స్వెటర్లు, ఉలెన్ దుప్పట్లు, మంకీ క్యాప్‌లు, ఫేస్ మాస్కుల అమ్మకాలు ఊపందుకున్నాయి. నేపాల్ నుంచి వచ్చి రోడ్డు పక్కన షెడ్‌లలో విక్రయిస్తున్నారు. స్వెటర్లకు వెయ్యి నుంచి 1500 చొప్పున విక్రయిస్తున్నారు. మంకీక్యాపులు, చేతి గ్లౌజులకు రూ.200 చొప్పున విక్రయిస్తున్నారు. చిన్నారుల స్వెటర్లు, సాక్సుల అమ్మకాలు పెద్దఎత్తున జరుగుతున్నాయి. జిల్లా కేంద్రంతోపాటు, రామకృష్ణాపూర్, శ్రీరాంపూర్, బెల్లంపల్లి పట్టణాల్లో విక్రయిస్తున్నారు. చలి కాలంలో నేపాల్‌కు చెందిన వారు ఇక్కడకు వచ్చి మూడు నెలల పాటు విక్రయిస్తారు.

పార్కులపై పట్టింపేది..?

- అసంపూర్తిగా నిర్మాణ పనులు
- పూర్తయిన వాటిపై పర్యవేక్షణ కరువు
- మందుబాబులకు అడ్డాలుగా మారుతున్న పార్కులు



అర్థంతరంగా నిలిచిన రాజీవ్‌నగర్ పార్కు



మందుబాబులు తాగిపడేసిన సీసాలు

మంచిర్యాల అర్బన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల మున్సి పాలిటీ పరిధిలో నిర్మించిన పార్కులపై అధికారుల పట్టింపు కరువైంది. పిల్లలకు ఆనందాన్ని, ఆహ్లాదాన్ని, పెద్దలకు కాలక్షేపాన్ని పంచాల్సిన పార్కు లు మందుబాబులకు అడ్డాలుగా మారుతున్నాయి. పార్కుల వద్ద వాచ్‌మన్ లు లేకపోవడం, పూర్తిస్థాయిలో ప్రహరీ లేకపోవడంతో పగలు, రాత్రి అనే తేడా లేకుండా మందుబాబులకు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. 2022లో పట్టణ ప్రగతి నిధులతో మున్సిపాలిటీలో 7 పార్కు లను ఏర్పాటు చేశారు. వాటిలో ఓ పార్కు పనులను కనీసం ప్రారంభించక పోగా, రెండు పార్కుల నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. నాలుగు పార్కులు పనులు పూర్తి చేసి ప్రారంభమైనప్పటికీ పర్యవేక్షణ లోపించడంతో అధ్వాన్నంగా మారాయి. పిల్లలు ఆడుకునేందుకు ఆట వస్తు వులను అమర్చలేదు. దీంతో పిల్లలకు ఆటవిడుపు అందని ద్రాక్షగానే మిగిలింది.

ఏర్పాటు చేసిన పార్కుల వివరాలు..

● పట్టణంలోని జన్మభూమినగర్‌లో గల రామునిచెరువులో రూ.3.50 కోట్లతో పార్కుఅభివృద్ధి పనులను చేపట్టారు. పనులు ప్రారంభించి చెరువు కట్ట వెంబడి పిట్టగోడలను నిర్మించి, రైలింగ్‌ను ఏర్పాటు చేసి, కట్టకు చెరువులోపలి వైపు బండరాళ్లనువేసి వదిలేశారు. అర్థాంతరంగా నిలిచిపోయిన పనులు ఇంతవరకు పూర్తి కాలేదు.

● రాజీవ్‌నగర్ పార్కు నిర్మాణాన్ని రూ.60లక్షలతో చేపట్టగా రూ.20 లక్షల పనులు మాత్రమే పూర్తయ్యాయి. గోడలు మాత్రమే నిర్మించి వదిలేశారు. మళ్లీ ఎలాంటి పనులు చేపట్టకపోవడంతో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి.

● కాలేజీరోడ్‌లో పార్కుతో పాటు ఓపెన్ జిమ్ ఏర్పాటుకై రూ.90 లక్షలతో పనులు చేపట్టగా రూ.20లక్షలతో గోడలు, వాకింగ్ ట్రాక్ పనులు, పక్కనే మరో రూ.10లక్షలతో ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేశారు. మరో రూ.60లక్షల పనులు పెండింగ్‌లో ఉండగా కాంట్రాక్టర్ చేతు లెత్తేశాడు. రెండు సంవత్సరాలు పూర్తైనా కనీసం అధికారులు దాని ఊసే ఎత్తడం లేదు.

● రూ.80లక్షలతో పాత మంచిర్యాల పార్కును నిర్మించారు. పనులు పూర్తి చేయడంతోపాటు అప్పటి ఎమ్మెల్యే ప్రారంభించారు. అప్పటి నుంచి నిర్వహణ లేకపోవడంతో పార్కు అంతా చెత్తాచెదారంతో నిండిపోయి అధ్వాన్నంగా మారింది. వాచ్‌మన్ లేకపోవడంతో అధాన్న స్థితికి చేరుకుంది.

● హైటెక్‌సిటీలో రూ.60లక్షలతో, రాంనగర్‌లో రూ.80లక్షలతో 100 శాతం పనులను పూర్తిచేసి పిల్లల ఆట వస్తువులను ఏర్పాటు చేశారు. ఆయా పార్కుల నిర్వహణ కొరవడినప్పటికీ మిగితా వాటితో పోలిస్తే కాస్త మెరుగ్గా ఉండటంతో పార్కులకు వచ్చే వారి సంఖ్య బాగానే ఉంటుంది. రాంనగర్ పార్కులో పిల్లల ఆట వస్తువులు ఎక్కువగా ఉండటంతో ఉద యం, సాయంత్రం వేళల్లో తల్లిదండ్రులు వారి పిల్లలను ఆటవిడుపు కోసం తీసుకువస్తున్నారు.

● రెడ్డికాలనీలో రూ.40లక్షలతో నిర్మించి అందుబాటులోకి తీసుకువచ్చారు. ఆ పార్కులోనే ఓపెన్ జిమ్ పరికరాలను అమర్చారు. జిమ్ పరికరాలు విరిగిపోయి నిరుపయోగంగా మారాయి. పిచ్చిమొక్కలు, గడ్డి ఏపుగా పెరిగాయి. మందుబాబులకు ఈ పార్కు ప్రధాన అడ్డాగా మారింది.

వాచ్‌మన్‌లు లేకపోవడమే ప్రధాన కారణం...

పార్కుల నిర్వహణ లోపించడానికి వాచ్‌మెన్‌లు లేకపోవడమే ప్రధాన కారణంగా చెప్పవచ్చు. పార్కులకు వాచ్‌మెన్‌లను నియమించి ఎప్పటి కప్పుడు శుభ్రం చేయిండం వల్ల మానసికోల్లాసాన్ని పంచే వాతావరణాన్ని సంతరించుకుంటాయి. అధికారులు ఈ విషయంపై అలోచించి పార్కుల నిర్వహణ సక్రమంగా జరిగేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

రాజీవ్‌నగర్ పార్కును త్వరగా పూర్తి చేయాలి



భార్య, పిల్లలను తీసుకొని కాలక్షేపం కోసం వెళ్దామంటే రెండవ పట్టణం లో ఒక్క పార్కు కూడా లేదు. రాజీవ్‌నగర్ పార్కు పనులను ప్రారంభించి రెండు యేండ్లు దాటినా వినియోగంలోకి తీసుకురాలేదు. పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. వెంటనే పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేసి పార్కును వినియోగంలోకి తీసుకురావాలి. అలాగే పిల్లల ఆడుకేనేందుకు ఆట వస్తువులను ఏర్పాటు చేయాలి.

-నల్ల మల్లేష్, గాంధీనగర్ వాసి



రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

కెరమెరి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): వాంకిడి మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమబాలికల పాఠశాల విద్యార్థిని శైలజ 25రోజులుగా హైదరాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొం దుతూ సోమవారం మృతిచెందింది. దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించి బాధిత కుటుంబానికి రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని సీఐటీయూ నాయకుడు ఆనంద్‌రావు డిమాండ్ చేశారు. అలాగే కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ప్రజా ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలి: ఎస్పీ



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

ఆసిఫాబాద్ రూరల్, నవంబరు 25(ఆంధ్ర జ్యోతి): గ్రీవెన్స్‌లో వచ్చిన అర్జీల బాధితులకు సత్వరమే న్యాయం చేయాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా లోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులతో నేరుగా మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. సంబం ధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఫిర్యాదులపై తక్షణచర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలన్నారు. ప్రజలకు పోలీసుశాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషిచేస్తున్నామన్నారు. పోలీసుస్టేషన్‌కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలని తెలిపారు.

మహిళా చట్టాలపై అవగాహన సదస్సు



విద్యార్థులతో షీటీం సభ్యులు

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జన్కాపూర్ జూనియర్ కళాశాలలో సోమవారం షీటీం సభ్యులు మహిళాచట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షీటీం ఇన్‌చార్జి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మహిళలపై హింస, ఈవ్‌టీజింగ్, సైబర్‌క్రైంలకు ఎవరైనా గురి అయినట్లయితే వెంటనే షీటీంను సంప్రదించాలన్నారు. ముఖ్యంగా సామాజిక మాధ్యమాలు అయిన ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రాం వంటివాటిని వినియోగంలో చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. అత్యవసర సమయంలో డయల్ 100కు, షీటీం 8712670564ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, షీటీం సభ్యులు సునీత, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

మండలాన్ని అన్నివిధాల అభివృద్ధి చేస్తా:ఎమ్మెల్సీ



భూమి పూజచేస్తున్న ఎమ్మెల్సీ దండె విఠల్

సిర్పూర్(టి), నవంబరు 25 (ఆంధ్ర జ్యోతి): మండలాన్ని అన్నివిధాల అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్సీ దండెవిఠల్ అన్నారు. సోమవారం నవేగాం గ్రామ పంచాయతీలోని సాయిబాబా ఆలయం వద్ద ఎస్ఎఫ్‌సీ లక్ష రూపాయల నిధులతో మంజూరైన బోర్‌వెల్‌కు భూమిపూజ చేశారు. అలాగే మండలకేంద్రంలోని అంగడిబజార్‌లో స్వచ్ఛభారత్‌మిషన్ ద్వారా రూ.2.10లక్షలు, గ్రామపంచాయతీ నిధుల్లోనుంచి రూ.90వేలుమొత్తం రూ.3లక్షలతో మరుగుదొడ్ల నిర్మాణానికి భూమిపూజచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో త్వరలో బస్టాండు ప్రహరీకి రూ.10లక్షలు మంజూరు అయ్యాయని, త్వరలో నిర్మాణాలు చేపడుతామన్నారు. అలాగే బస్టాండు నిర్మాణానికి కృషి చేస్తానని అన్నారు. ఆయనవెంట నాయకులు సిడాం గణపతి, హర్షద్‌హుస్సేన్, విశ్వనాథ్, నానయ్య, సోహెల్ అహ్మద్, ఎస్‌రాజు, అబ్దుల్ అకీల్‌సరిత, సలీం, తులసీరాం, మోహిజ్, సీతారాం, ఈవో తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

ఎండీఎంలో వంటల పోటీలు



ఎండీఎం నిర్వాహకురాలిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): జడ్పీఎస్ఎస్ గర్ల్స్ పాఠశాలలో జిల్లాస్థాయిలో పోషన్‌అభియాన్‌కింద సోమవారం వంట చేయడంలో పోటీలు నిర్వహించారు. అందులో మొదటి బహుమతి ఆసిఫాబాద్ మండలం, రెండో బహుమతి రెబ్బెన మండలం, మూడో బహుమతి కాగజ్‌నగర్ మండలం ఎంపిక అయినట్లు కోఆర్డినేటర్ మధుకర్ తెలిపారు. ఎండీఎం(మిడ్ డేమీల్స్)లో మంచినాణ్యమైన వంటలుచేయాలని, తగుజాగ్రత్తలు పాటించాలని, మెనూపాటిస్తూ రుచికరమైన భోజనం పిల్లలకు అందించాలన్న ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఏసీజీఈఉదయ్‌బాబు, ఎఫ్ఏవో దేవాజీ, ఎంఈవో సుభాష్, హేమంత్,మోహన్‌తదితరులు పాల్గొన్నారు.

మెమెంటో అందజేత

కాగజ్‌నగర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో అనారోగ్యంతో చికిత్సపొందుతూ ఈనెల15న మృతిచెందిన కాగజ్ నగర్ వ్యాపారి మిట్టపల్లి మహేష్ కుటుంబసభ్యులకు సదాశయ ఫౌండేషన్ అధ్యక్షుడు అనంతరాములు మెమొంటోను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహేష్ మరణించగా ఆయన కుటుంబ సభ్యులు అతని కళ్లను దానంచేసి ఇతరులకు చూపు ప్రసాదించారని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీవైస్‌చైర్మన్ రాచకొండ గిరీష్, నాయకులు రవీందర్‌గౌడ్, అరిగెల శ్రీనివాస్‌గౌడ్, కొండ రవి, తాటిపాము వేణుబాబు, తదితరులు పాల్గొన్నారు.

- వాంకిడి మండలంలో పశువుల మందపై దాడి
- వ్యవసాయ పనుల సమయంలో పొంచి ఉన్న ప్రమాదం
- భయందోళనలో అటవీప్రాంత ప్రజలు



గాండ్రిస్తున్న బెబ్బులి

పులి అడుగులను పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

వాంకిడి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): వాంకిడి మండలంలో మళ్లీ బెబ్బులి గాండ్రిస్తోంది. వర్షాకాలం తరువాత ఆహారం, తోడు కోసం అడవిని దాటి బయటకు వస్తున్న పులులు వరుసగా పశువులపై దాడులకు దిగుతున్నాయి. తాజాగా ఆదివారం మధ్యాహ్నం వాంకిడి మండలంలోని ధాబా, బండకాసా గ్రామాల అటవీ ప్రాంతంలో పశువుల మందపై దాడి చేసి ఐదుపశువులను గాయపర్చింది. మొదటగా ధాబా గ్రామసమీపంలో చేనులో పశువులను మేపుతున్న నవునాత్ అనే యువకుడికి పులి కనిపించింది. వెంటనే అతను కేకలు వేస్తూ గ్రామస్తులకు తెలిపాడు. తరువాత కొంత దూరంలో పశువుల మందపై దాడి చేసి ఐదు పశువులను గాయపర్చింది. అక్కడే పశువులను మేపుతున్న ఇద్దరు కాపరులు గ్రామస్తులకు సమాచారం అందించడంతో గ్రామస్తులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. దీంతో పులి అక్కడినుండి అడవి ప్రాంతానికి వెళ్లిందని ప్రత్యక్షసాక్షులు తెలిపారు. ఆదివారం అర్ధరాత్రి పులి తిరిగి ధాబా గ్రామంగుండా అడవిలోకి వెళ్లిందని గ్రామస్తులు పేర్కొన్నారు. సోమవారం ఎఫ్ఆర్‌వో గోవింద్‌సింగ్ సర్దార్ ఆధ్వర్యంలో అటవీశాఖ సిబ్బంది ధాబా గ్రామసమీపంలో పులి అడుగులను గుర్తించి సీసీకెమెరాలను ఏర్పాటు చేశారు. ధాబా, బండకాసా అటవీప్రాంతంలో పులి సంచరిస్తున్నం దున గిరిజన గ్రామాల ప్రజలను అటవీశాఖ అధికారులు అప్రమత్తం చేస్తున్నారు.

● పశువుల మందపై దాడి..

వాంకిడి మండలంలోని ధాబా, బండకాసా గ్రామ సమీపంలో పశువుల మందపై పులి దాడిచేసి ఐదు పశువులను గాయపర్చడంతో పరిసర ప్రాంతాల గిరిజన రైతులు భయందోళనకు గురవుతున్నారు. గతేడాది నవంబరు మాసంలోనే మండలంలోని చౌపన్‌గూడ పంచాయతీలోని ఖానాపూర్ గ్రామానికి చెందిన సీడాం భీము అనే రైతుపై పులిదాడి చేసి హతమార్చింది. తాజాగా పశువులపై పులిదాడి చేయడంతో ఎప్పుడు ఏం జరుగుతుందో అన్న భయంతో గిరిజనులు బిక్కుబిక్కుమంటున్నారు. చేన్లలో పత్తి తీయడానికి వెళ్లేందుకు రైతులు జంకుతున్నారు. పులి అడుగులను గుర్తించిన అటవీశాఖ అధికారులు పులి పరిసర ప్రాంతంలోనే సంచరిస్తున్నట్లు గుర్తించడంతో గిరిజనులు ఆందోళనకు గురవుతున్నారు. జిల్లాలో చాలావరకు పత్తి చేలు అడవులను ఆనుకుని, గుట్ట ప్రాంతాల్లోనే ఉన్నాయి. రైతులు వ్యవసాయ పనులతో బిజీగా ఉన్న సమయంలోనే పులుల సంచారం పెరగడంతో ప్రమాదం పొంచి ఉంది.

గాయపడిన పశువులకు నష్టపరిహారం అందించాలి..

- పశువుల యజమానులు

ఆదివారం పులిదాడిలో గాయపడిన పశులకు నష్టపరిహారం అందించాలని పశువుల యజమానులు డిమాండ్ చేశారు. పులిదాడిలో గాయపడిన ఐదుపశువుల్లో మూడు పశువుల పరిస్థితి విషమంగా ఉందన్నారు. అవి బతికే అవకాశాలు తక్కువగా ఉన్నాయని యజమానులు ఆందోళన వ్యకం చేస్తు న్నారు. అటవీశాఖ అధికారులు గాయపడిన పశువులకు నష్టపరిహారం అందించి మెరుగైన చికిత్సలు అందించాలని కోరారు.

ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి: కలెక్టర్



దివ్యాంగుడి నుంచి అర్జీ స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో అందిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ వెంకటేష్‌దోత్రే అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. చింతలమానేపల్లి మండలం కర్జవెల్లి గ్రామానికి చెందిన చౌదరి ఓంకార్ తనకు దివ్యాంగుల పెన్షన్ మంజూరు చేయాలని దరఖాస్తు అందజేశారు. రెబ్బెనమండలం ఎడవెల్లి గ్రామానికి చెందిన రాథోడ్ సునీత తన భర్త మరణించినందున వితంతు పెన్షన్ ఇప్పించాలని, చింతలమానేపల్లి మండలం కర్జవెల్లి గ్రామానికి చెందిన రైతులు తమ చేనులోకి వెళ్లేందుకు దారి సౌకర్యం కల్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఆసిఫాబాద్ మున్సిపల్ పరిధిలోని నూర్‌నగర్ వాసులు తమకాలనీలో విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి పోచమ్మగుడివరకు రోడ్డువేయాలని దరఖాస్తు అందజేశారు. సిర్పూర్(యు)మండలం ధనోర(పి) గ్రామానికి చెందిన ప్రియాంక తనకు ఆశ కార్యకర్త ఉద్యోగం ఇప్పించాలనికోరుతూ అర్జీ సమర్పించారు. ఆసిఫాబాద్ పట్టణంలోని జన్కాపూర్‌కు చెందిన మల్లయ్య తనకు ఉపాధిహామీ పథకంలో పని కాలానికి సంబంధించిన డబ్బులు ఇప్పించాలని దరఖాస్తు అందజేశారు. రెబ్బెన మండలం నారాయణపూర్‌కు చెందిన శ్రవంతి తనకు రావాల్సిన రైతురుణమాఫీ డబ్బులు తన ఖాతాల్లో జమచేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. వాంకిడి మండలం ఖమాన గ్రామానికి చెందిన దేవాజీ తనకు వృద్ధాప్య పెన్షన్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈసందర్భంగా కలెక్టర్ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులు క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలని జూమ్ ద్వారా తహసీల్దార్‌లు, ఎంపీ డీవోలు, ఇతర అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

గిరి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి..

తిర్యాణి: గిరి విద్యార్థులకు నాణ్యమైన విద్య భోజనం అందించాలని కలెక్టర్ వెంకటేష్‌దోత్రే అన్నారు. సోమవారం మండలంలోని మంగి ఆశ్రమ పాఠశాలతోపాటు గుండాల హెల్త్‌సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అధికారపార్టీ నాయకులతో కలిసి మంగి-గుండాల రోడ్డును పరిశీలించారు. ఈసందర్భంగా మంగిలోని ఆశ్రమ పాఠశాల విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యే విధంగా చర్యలు చేపట్టాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. పాఠశాలకు విద్యుత్ మరమ్మతులను నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అలాగే విద్యార్థులకు మంచినీటిసౌకర్యం కల్పించేవిధంగా మిషన్ భగీరథ ట్యాంకుకు మోటారు అమర్చాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి కృష్ణతేజను ఆదేశించారు. మంగిలో విధులు నిర్వహించే ఏఎన్ఎం సక్రమంగా విధులకు హాజరు కావడం లేదని గ్రామస్థులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. మంగిలోని సబ్‌సెంటర్‌కు మరమ్మతులు నిర్వహించి ఏఎన్ఎం ఇక్కడే ఉండి విధులు నిర్వహించే విధంగా చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కలెక్టర్‌ను కోరారు. మంగిలోని కోలాంగూడకు వెళ్లేదారిలో కల్వర్టు నిర్మించాలని మాజీసర్పంచ్ బొజ్జిరావు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దానికి కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. మంగిలో అదనంగా అంగన్‌వాడీ భవనాన్ని నిర్మించాలని గ్రామస్థులు కలెక్టర్‌ను కోరారు. అనంతరం మంగి నుంచి మాణిక్యాపూర్ వరకుఉన్న రోడ్డును పరిశీలించారు. అనంతరం గుండాల గ్రామంలో సబ్‌సెంటర్‌ని తనిఖీ నిర్వహించారు. సబ్‌సెంటర్‌లో అవసరమైన సామగ్రిని వెంటనే అందించాలని ఎంపీడీవో మల్లేష్‌ను ఆదేశించారు. మంగిలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్‌తో పాటు ఏఎన్ఎం, ఆశావర్కర్లు క్రమం తప్పకుండా విధులకుహాజరై గిరిజనులకు మెరుగైనవైద్యసేవలు అందించాలని కోరారు. మారుమూల గ్రామాలరోడ్ల నిర్మాణానికి రూ.4 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. త్వరలోనే అటవీ అధి కారులతో మాట్లాడి రోడ్లపనులు ప్రారంభమయ్యే విధం గా చర్యలు చేపడుతామని కలెక్టర్ తెలిపారు. మొట్ట మొదటిసారిగా గుండాలగ్రామాన్ని సందర్శించిన కలెక్ట ర్‌ను గ్రామస్థులు సన్మానించారు. తిర్యాణి మండల కేంద్రంలో జంగుబాయి మండలసమాఖ్య కార్యాలయంలో సంఘమహిళలతో మాట్లాడి ఆర్థిక అభివృద్ధి సాధించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుగుణ, అనిల్‌గౌడ్, డీడీ రమాదేవి, ఈఈ ప్రభాకర్, డీఈ రాజన్న, ఏటీడీవో చిరంజీవి, ఎంపీడీవో మల్లేష్, తహసీల్దార్ సూర్యప్రకాష్, ఎస్సై మాదవ్‌గౌడ్, ఏఈలు సువాస్, కృష్ణతేజ, నాయకులు సాగర్ పాల్గొన్నారు.



తిర్యాణిలో పర్యటిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

రేపు జాతీయ లోక్ అదాలత్ సన్నాహక సమావేశం

ఆసిఫాబాద్ రూరల్, నవంబరు 25(ఆంధ్ర జ్యోతి): జిల్లాకేంద్రంలోని కోర్టు భవనం ఆవరణలో డిసెంబరు 14న జరుగనున్న జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమానికిగాను ఈ నెల27న కోర్టుభవనంలో సన్నాహక సమావేశం నిర్వహిస్తామని జిల్లా ప్రధానన్యాయాధికారి, జిల్లా న్యాయ సేవాధికారసంస్థ చైర్మన్ ఎంవీ రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. లోక్‌అదాలత్ కార్యక్రమంలో క్రిమినల్, సివిల్, ప్రి లిటిగేషన్, బ్యాంకింగ్, విద్యుత్, భూతగాదాలు, వివాహ, కుటుంబ కేసులు, వాహన ప్రమాదాలు, చిట్ ఫండ్, చెక్‌బౌన్స్ ఇతర కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరిస్తామన్నారు. పోలీసు అధికారులు, సంబంధిత అధికారులు తమ పరిధిలోని కేసుల పూర్తి వివరాలతో సన్నాహక సమావేశానికి హాజరు కావాలని తెలిపారు.

నేడు ఆటల పోటీలు

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 25(ఆంధ్ర జ్యోతి): అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవంను పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని ట్రైబల్ వెల్ఫేర్ మోడల్ స్పోర్ట్స్ స్కూల్‌లో ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా సంక్షేమాధికారి భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలకు ఆసక్తిగల దివ్యాంగులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

భుసిమెట్ట అడవుల్లో మరోసారి పులి వదంతులు

జైనూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): భుసిమెట్ట అడవుల్లో సోమవారం మళ్లీ సంచరించిందని గ్రామస్థులు ఆందోళన చెందారు. అటవీశాఖ బంగ్లా పరిసర చేనులో ఉన్న ఎద్దుపై పులిదాడి చేసిందని బాధిత రైతు ముర్మరే ఉత్తం తెలిపారు. ఎద్దు వెనుక కాలిపై పులిదాడి చేసి గాయపర్చిందని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. పులి వచ్చిందని సమాచారాన్ని అందుకున్న రైతులు, కూలీలు మధ్యాహ్నమే ఇంటికి ఉరుకులు పురుగులు తీశారు. పులి దాడితో ఎద్దు వెనుక కాలిపై గాయమైందన్నారు. సంఘటన స్థలాన్ని ఎఫ్ఆర్వో జ్ఞానేశ్వర్ సందర్శించారు. ఎద్దుపై పులిదాడి చేసిందని చెప్పడానికి ఆధారాలు లేవన్నారు. ఎప్పుడైన పులిముందు మెడ భాగంపై దాడి చేస్తుందని, వెనుక కాలిపై దాడికి పాల్పడదన్నారు.

హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలి

ఆసిఫాబాద్ రూరల్, నవంబరు 25(ఆంధ్ర జ్యోతి): మండంలోని రహపల్లి పాఠశాలలో విశ్రాంత ఉద్యోగి పదవీ విరమణ అనంతరం రావాల్సిన బెనిఫిట్స్‌ను మంజూరు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్న బూర్గుడ స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలని విశ్రాంత ఉద్యోగి టి సత్యనారాయణ కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఆర్డీవో లోకేశ్వర్‌రావుకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మార్చి 2024నుంచి రావాల్సిన 18 సంవత్సరాల స్కేల్ మంజూరు చేయకుండా వేధిస్తున్నాడని, వైద్యబిల్లులు సంబంధిత అధకారికి అందించక పోవడంతో మంజూరుకు నోచుకోలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు న్యాయం చేయాలని కోరారు.

టీడబ్ల్యూటీయూ జిల్లా అధ్యక్షుడికి సన్మానం

జైనూర్, నవంబరు 25,ఆంధ్రజ్యోతి): తెలంగాణ గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన రాథోడ్ రవిందర్‌ను టీడబ్ల్యూటీయూ జిల్లా నాయకులు ఉయిక శంకర్ సోమవారం ఘనంగా సన్మా నించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడిగా రాథోడ్ రవిందర్ ఎన్నికపట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. అదేవిధంగా తెలంగాణ గిరిజన సంక్షేమ ఉపాధ్యాయులు సమస్యలు పరష్కరించడంలో రాథోడ్ రవిందర్ అన్నివిధాలుగా కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

మాలల సింహ గర్జన పోస్టర్ల విడుదల

కౌటాల, నవంబరు 25: హైదరాబాద్‌లో డిసెంబరు1న నిర్వహించే మాలల సింహ గర్జనకు సంబంధించిన పోస్టర్లను సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ మాల, మహర్, నేతకాని, ఉపకులాల వారు అధిక సంఖ్యలో హాజరై సింహగర్జనను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు సుభాష్, శ్రీనివాస్, మల్లేష్, మొగిలి, వెంకటేష్, జయదేవ్, నర్సయ్య, శ్రీనివాస్, బండురావు, దేవాజీ, దిలీప్‌కుమార్, వెంకటేష్, ఏమాజీ, మారుతి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాల మహానాడు నాయకులు

విద్యార్థినులకు స్వెటర్ల పంపిణీ



విద్యార్థినులకు స్వెటర్లు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

పెంచికలపేట, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెడ్వాయి జిల్లాపరిషత్ సెకండరీపాఠశాలలో సోమవారం ఉపాధ్యాయుడు తంగేడిపల్లి రాకేష్ తల్లిదండ్రులు శాంత, దత్తు, మరో ఉపాధ్యాయుడు చౌదరి వెంకటేష్ తన తండ్రి బాపు స్మారకార్థం 40మంది విద్యార్థినులకు సోమవారం స్వెటర్లు పంపిణీచేశారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు, ఎంఈవో రమేష్ బాబు, అమ్మ ఆదర్శపాఠశాల చైర్మన్‌తార, ఉపాధ్యాయులుయాదగిరి,అశోక్,చందర్, రాజ్‌కమలాకర్‌రెడ్డి, శిల్ప, సునీత, స్వప్న, పంచాయతీ కార్యదర్శి రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థిని మృతి

- 20రోజులుగా వెంటిలేటర్‌పై చికిత్స
- దాబా గ్రామంలో విషాదఛాయలు



రోదిస్తున్న కుటుంబ సభ్యులు



శైలజ(ఫైల్)

వాంకిడి, నవంబరు 25: వాంకిడి గిరిజన ఆశ్రమపాఠశాలలో చదువుతూ అస్వస్థతకు గురై హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థిని చౌదరి శైలజ(14) (9వ తరగతి) సోమవారం చికిత్సపొందుతూ మృతి చెందింది. అక్టోబరు30న పాఠశాలలో వాంతులు విరేచనాలు కావడంతో వాంకిడి వైద్యశాలలో చికిత్సలు అందించారు. పరిస్థితి విష మించడంతో మంచిర్యాలలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేసి మెరుగైనవైద్యం కోసం హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. దాదాపు 20 రోజులుగా వెంటిలేటర్‌పై చికిత్సపొందిన విద్యార్థిని సోమవారం తుదిశ్వాస విడిచింది. శైలజను హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి తీసుకువస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. విద్యార్థిని శైలజ వృతిచెందడంతో మండలంలోని దాబా గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

- కుటుంబంలో విషాదం..

దాబా గ్రామానికి చెందిన చౌదరి మీరాబాయి, తుకారాంలకు ఇద్దరు సంతానం. ఒక కూతురు శైలజ వాంకిడి గిరిజన ఆశ్రమపాఠశాలలో చదువుతుండగా కుమారుడు నవునాథ్ ప్రైవేట్‌పాఠశాలలో 6వతరగతి చదువుతున్నాడు. ఉన్నత చదువులు చదివి ప్రయోజకురాలు అవుతుందని ఎంతో ఆశలు పెట్టుకున్న శైలజ మృతి చెండడంతో కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. శైలజ మృతిచెందిన సమాచారం తెలియడంతో కుటుంబసభ్యుల రోధనలు మిన్నంటాయి. పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే శైలజ మృతి చెందిందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. విద్యార్థిని వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురై 27 రోజులు కావస్తున్నా అందుకు గల కారణాలు అధికారులు తెలపకపోవడంపై కుటుంబసభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థిని శైలజ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, ఇళ్లు, నష్టపరిహారం అందించాలని మాలీ సంఘం నాయకులు డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యే కోవ లక్ష్మి హౌస్ అరెస్ట్

ఆసిఫాబాద్ రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): వాంకిడి ఆశ్రమపాఠశాల విద్యార్థిని మృతిచెందిన నేపథ్యంలో కుటుంబ సభ్యులను పరామర్శించడానికి సిద్ధమవుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మిని హౌస్ అరెస్టు చేశారు. సీఐ రవీందర్ ఆధ్వర్యంలో భారీగా పోలీసులు మోహరించి ఆమెను అడ్డుకున్నారు. దీంతో కొద్దిసేపు పోలీసులకు బీఆర్ఎస్ నాయకులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఎమ్మెల్యే కోవ లక్ష్మితోపాటు ఇతర బీఆర్ఎస్ నాయకులు పోలీసుల తీరును నిరసిస్తూ ఆమె నివాసం వద్ద బైఠాయించారు.



ఇంట్లోనే బైఠాయించిన ఎమ్మెల్యే కోవ లక్ష్మి, బీఆర్ఎస్ నాయకులు